# భక్త రక్షణ

భగవంతుడు తన భక్తులను రక్షించుటకై అనేక రూపాలు ధరిస్తూ ఉంటాడు. భక్తులపై ఆయనకున్న వాత్సల్యము అపారమైనది. మరి అటువంటి భగవంతుని మహిమలను గురించి తెలుసుకుందాము.

అక్బర్ చక్రవర్తికి ప్రతి దినము ఉదయం ఏడు గంటలకు “సేనా”అనే వ్యక్తి వచ్చి, తలకు నూనె అంటి, ఒళ్లంతా మసాజ్ చేసేవాడు. అతను చాలా వినయవిధేయతలు కలవాడు మరియు శ్రీకృష్ణుని భక్తుడు. అతడు ప్రతి రోజు తెల్లవారుజామునే లేచి, స్నానం చేసి, శ్రీకృష్ణుని విగ్రహం ముందు కూర్చుని ధ్యానం చేసుకునేవాడు.

ఒకరోజు అతను ధ్యానంలో కూర్చుని ఉండగా, శ్రీకృష్ణుని దివ్య మంగళ రూపం అతనిని తన్మయత్వంలో ముంచేసింది. చాలా సేపు ఆ విధంగా కూర్చున్నాడు. అతని భార్య “అయ్యో! చక్రవర్తి గారి కొలువుకు సమయం మించి పోతుంది. ఆలస్యంగా వెళితే ఏం శిక్ష విధిస్తారో ?” అని భయపడింది. పోనీ భర్తను పిలుద్దామా అంటే, ధ్యాన భంగం కలిగించడం తప్పు కదా అని తలచినది. అదే సమయంలో రాజభవనంలో అక్బర్ చక్రవర్తికి “సేనా” తలకు నూనెను అంటి, వళ్ళంతా మసాజ్ చేస్తున్నాడు. అక్బర్ చక్రవర్తి “సేనా ! ఈరోజు నీ మసాజ్ ఎంతో ఆనందాన్ని కలిగించుచున్నది. నీ చేతిలో ఏదో మహిమ వున్నది” అన్నాడు. సేనా నూనె గిన్నెను కింద పెట్టాడు. రాజుగారు తలవంచుకొని, కళ్ళు మూసుకుని వున్నారు.



కొంత సేపటికి కళ్ళు తెరవగా, శ్రీకృష్ణుని దివ్య సుందర రూపము అందులో కనపడింది. అక్బర్ చక్రవర్తికి ఆశ్చర్యం వేసింది. తల పైకెత్తి “సేనా “అని పిలిచాడు. సేనా అక్కడ లేడు. ఏదో పని మీద వెళ్లి ఉంటాడు అని అనుకున్నాడు. కానీ అతని హృదయంలో ఆ దివ్య మంగళ రూపం అలాగే ఉండిపోయింది. ఈ రెండవ సేనా ఎవరో మీకు అర్థమైపోయి ఉంటుంది కదా.

సాక్షాత్తు శ్రీ కృష్ణ పరమాత్ముడే తన భక్తుడైన సేనాను రక్షించుట కొరకు అతని రూపాన్ని ధరించాడు. భక్తులపై ఆయనకు ఉన్నటువంటి ప్రేమ అటువంటిది.

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారు తన అవతారంలో భక్తులను సంస్కరించటమే ప్రధానవుద్దేశ్యంగా తెలిపారు.

* **వేద పోషణ**

***విద్వత్పోషణ**

***ధర్మ రక్షణ**

* **భక్త సంరక్షణము** కూడా తన అవతార కార్యక్రమంలోని ముఖ్య లక్ష్యాలు అని *తెలిపారు. భక్తులను రక్షించుటకు స్వామి ఎన్నో సందర్భాల్లో అనేక రూపాలు ధరించారు. ఒకసారి భోపాల్ లో ఉన్న తన భక్తుని ఎలా రక్షించారంటే...

భోపాల్ లో ఒక సైనికాధికారి ఉన్నాడు. అతని భార్య శ్రీ సత్య సాయి బాబా వారి భక్తురాలు. ఆ సైనికాధికారి రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో పాల్గొని చాలా పేరు పొందాడు.



అక్కడ  రాష్ట్ర పునర్నిర్మాణ కార్యక్రమాలు జరుగుతుండటం వల్ల సైన్యం లో వున్నపాత అధికారులను తొలగించి, కొత్త అధికారులకు నియమించారు. పాతవారిని నిరాదరించుట వలన అతడు చాలా బాధపడ్డాడు. అతనికి జీవితం మీద చాలా విరక్తి కలిగింది. ఆ సమయంలో అతనిని ఓదార్చడానికి ఎవ్వరూ లేరు. అతని భార్య కూడా పుట్టింటికి వెళ్ళి ఉన్నది. నిరాశ చెందిన అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని దగ్గర ఉన్న రివాల్వర్ తీసుకుని, సరిగ్గా ఉన్నది లేనిది చూచుకుటకై ఒకసారి పేల్చాడు. రెండవసారి కాల్పుతో తన ప్రాణం తీసుకోబోయాడు.

సరిగ్గా అదే సమయంలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారు కొడైకెనాల్లో భక్తులతో ఉన్నారు. హఠాత్తుగా లేచి నిలబడి "కాల్చవద్దు" అంటూ, తన స్థూల శరీరాన్ని వదిలి పెట్టి వెళ్ళి, ఒక గంట తర్వాత మళ్ళీ తన శరీరం లోనికి ప్రవేశించారు. అప్పుడు భక్తులు ఏమైందో అని స్వామిని అడుగగా స్వామి తన చెంతనే వున్న సచ్చిదానందతో "గాభరా పడవద్దు. రివాల్వర్ నా దగ్గర ఉన్నది—బాబా" అంటూ భోపాల్ కి "అర్జెంట్ టెలిగ్రామ్" పంపమని ఆదేశించారు. అప్పుడు ఆయన స్వామితో "స్వామి! రివాల్వర్ అనే పదం ఉంటే పోస్టాఫీసు వారు టెలిగ్రామ్ లో అంగీకరించరు కాబట్టి "ఇన్‌స్ట్రుమెంట్" అనే పదం వాడుదాము అన్నారు. స్వామి సరేనన్నారు. టెలిగ్రామ్ పంపడం జరిగింది. కానీ భక్తులకు అసలు ఏం జరిగిందో అర్థం కాలేదు.

అక్కడ భోపాల్ లో ఆ సైనికాధికారి రివాల్వర్ తో తన ప్రాణములు తీసుకోబోతుండగా, ఇంటి తలుపులు వాటంతటవే తెరుచుకున్నాయి.



గుమ్మంలో కాలేజీలో తనతో కలిసి చదువుకున్న తన ప్రాణ స్నేహితుడు,అతని భార్య, వారి సామాను మోసుకుని వచ్చినటువంటి కూలీ వున్నారు. ఆ సైనికాధికారి వారిని స్వాగతించుట కొరకై, గబగబా లోపల గదిలోనికి వెళ్లి రివాల్వర్ దాచిపెట్టి వచ్చి, నవ్వుతూ వారిని ఆహ్వానించి, వారి క్షేమ సమాచారాలు అడిగారు. ఆ స్నేహితుడు కూడా కాలేజీలో చదువుకునే విషయాలన్నీ గుర్తుకు తెచ్చి, అతనికి చాలా ఆనందం కలిగించాడు. ఆ దంపతులతో మాట్లాడుతూ అతను తన బాధను మర్చిపోయాడు .

ఒక గంట తర్వాత తన స్నేహితుడు, అతని భార్య మరొక స్నేహితుడు ఇంటికి వెళతామని, ఇంకోసారి తప్పకుండా వస్తామని, ఎంత బలవంతం చేసినా వినకుండా వెళ్ళిపోయారు. వారు వెళ్ళిన తర్వాత ఆ సైనికాధికారి గదిలోకి వెళ్లి చూడగా తన రివాల్వర్ కనిపించలేదు. ఆ గది అంతా వెతికాడు. ఎక్కడా దొరకలేదు. వెంటనే స్వామిని ప్రార్థించుకుని, ఇదంతా స్వామి లీల తప్ప మరేమీ కాదు అనుకుని తన స్నేహితుడు, అతని భార్య వెళ్ళిన ఇంటికి బయలుదేరాడు. అక్కడ వెళ్లి చూడగా వారిద్దరూ  అక్కడికి రాలేదని తెలిసినది. “తనని రక్షించటానికి స్వామి వారి రూపంలో వచ్చారని తెలుసుకుని” ఇంటికి తిరిగి వచ్చాడు. వెంటనే బాబా నుంచి టెలిగ్రామ్ వచ్చింది. అందులో “గాబరా పడవద్దు, పరికరం నా వద్దనే ఉన్నది” అని. ఎక్కడ నుంచి వచ్చిందో చూడగా అది “కొడైకెనాల్ నుంచి వచ్చిన అర్జంట్ టెలిగ్రామ్” అని తెలిసింది. అతను చాలా పశ్చాత్తాపం చెంది బాబా వారికి కృతజ్ఞతా సూచకంగా జరిగిన విషయమంతా  వ్రాయగా అప్పుడు అక్కడ ఉన్న భక్తులందరికీ స్వామి “కాల్చవద్దు” అంటూ తమ స్థూల శరీరాన్ని వదిలి ఒక గంట సేపు భక్త రక్షణ కోసం వెళ్లారని  అర్థమైంది. (తపోవనం ఆధారంగా)



ఈ విధంగా స్వామి యొక్క భక్త సంరక్షణకు అవధులు లేవు. భక్తులను రక్షించాలంటే వారు ఆకాశంలో ఉన్న, భూగర్భం లోవున్ననూ, హిమాలయ పర్వతాలలో వున్ననూ రక్షించుట వారి అవతార లక్ష్యం.

ఒక్కొక్కసారి , స్వామి తమ భక్తులను సంరక్షించే నిమిత్తమై వారిని తమ భుజస్కంధాలపై మోసినటువంటి సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి.. స్వామి భక్తులయిన, కుప్పం వాస్తవ్యులైనటువంటి శ్రీ రాధాకృష్ణ గారి యదార్ధ సంఘటన గురించి తెలుసుకుందాం.

శ్రీ రాధాకృష్ణయ్యగారు చాలా కాలంగా గ్యాస్టిక్ ట్రబుల్ తో బాధ పడుతూ ఉండేవారు.. వారి బాధను తాత్కాలికంగా నివారించుటకై డాక్టర్ ఆయనకు “మార్ఫిన్” అను మత్తు ఇంజక్షన్ ఇచ్చారు. అర్ధరాత్రి సమయంలో ఆయన లేచి బయటికి తవెళ్తూ, నిద్రమత్తులో చూసుకోకుండా, వారి పెరట్లో వున్నటువంటి నూతిలో జారిపడిపోయారు. ఆ బావి 50 అడుగుల ఎత్తులో ఉన్నది. అందులో 30 అడుగుల వరకు నీరు ఉన్నది. ఆయన భార్య శ్రీమతి రాధమ్మ గారు అర్ధరాత్రి, తన భర్త కనిపించకపోవడంతో పెరట్లో వెళ్లి పిలుస్తుండగా ఆయన నూతిలో ఉన్నట్టుగా తెలిసినది. తక్షణమే ఆమె వారి పిల్లలు అందర్నీ నిద్రలేపి వారిని పైకి తీసుకుని వచ్చుటకై ప్రయత్నించసాగారు.

ఆ సమయంలో ఒక ఇన్స్పెక్టర్ గారు ఖాకీ డ్రస్ లో వచ్చి, విషయం తెలుసుకుని వారిని పైకి తీసుకొని వచ్చుటకు సహాయం చేశారు. కుర్చీకి తాడు కట్టి బావిలోకి వదిలి, ఒక రాయి మీద వుండేట్లుగా కుర్చీని దింపారు.



హఠాత్తుగా రాధాకృష్ణయ్య గారు బంతిలాగా ఎగిరి వచ్చి ఆ కుర్చీలోకి వచ్చిపడ్డారు. అతన్ని మెల్లగా పైకి చేర్చి, సోఫాలో కూర్చోబెట్టి, డాక్టర్ కు కబురుపంపారు. డాక్టరు పరీక్ష చేసి ఈయన మునుపటికంటే ఆరోగ్యంగా ఉన్నారు. ఇది ఎలా సాధ్యం? ఒక చిన్న గాయం అయినా అవలేదే? అని ఆశ్చర్యపోయారు.

30 అడుగుల నీరు ఉన్న ఆ బావిలో ఆయన నీటి మీదఎలా నిలబడి ఉన్నారు ? ఆ డాక్టరు కూడా స్వామి భక్తుడే కనుక ఇది స్వామి యొక్క అపార అనుగ్రహమని భావించి, స్వామికి అంజలులర్పించారు. అంత హఠాత్తుగా ఇన్స్పెక్టర్ అక్కడికి ఎలా వచ్చారో అని అడగగా, ఈరోజు నా డ్యూటీ కూడా ఇక్కడ కాదు. రెండు వీధుల అవతల గస్తీ తిరుగుతుండగా, ఒక ముసలి వ్యక్తి వచ్చి "రాధాకృష్ణయ్య కు సహాయం చెయ్యి. త్వరగా వెళ్లు అని చెప్పారు" అన్నాడు.అప్పుడు వారు రాధాకృష్ణయ్య గారిని "అంత సేపు ఆ నీటిలో ఎలా నిలబడగలిగారు. బావి చాలా లోతు ఉంది కదా" అని అడగగా, ఆయన "నా కాళ్ళకింద ఏదో ఆధారమున్నదని నాకు తెలుస్తున్నది. దానిపైనే నిలబడి ఉన్నానని కూడా తెలుస్తున్నది" అన్నారు. బావిలోని ఆ కుర్చీలోనికి కూడా తన ప్రమేయం ఏమీ లేకుండా వచ్చినట్లుగా ఆయన చెప్పారు. అప్పుడు అందరూ "ఇది స్వామి మహిమనే కానీ, అన్యము కాదు" అని నిర్ధారించుకుని, వెంటనే ప్రయాణమై పుట్టపర్తి చేరారు.

వారిని చూడంగానే స్వామి రాధాకృష్ణయ్య గారి దగ్గరికి వెళ్ళి. "నిన్న రాత్రంతా నిన్ను మోసి మోసి నా భుజాలు ఇంకా నొప్పి పెడుతున్నాయి" అని అన్నారు.



అప్పుడు వారంతా కన్నీటితో స్వామి పాదములను అభిషేకించారు.(అన్యధా శరణం నాస్తి-ఆధారంగా వ్రాసినది).

స్వామి మన ఇంట, వెంట,జంట వుండి నిరంతరం మనల్ని కాపాడుతూ వుంటారు అని తెలియజేసే ఇంకొక సంఘటన గురించి తెలుసుకుందాం.

స్వామి బాల్యమిత్రులయిన శ్రీ నాగేశం గారు మరియు సత్యనారాయణ గారు సైనిక దళంలో జవాన్లుగా పని చేయుచుండిరి. వారిద్దరూ స్వామి పై చాలా భక్తి ప్రపత్తులను కలిగి యుండిరి. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో తూర్పుహిమాలయ ప్రాంతంలో జవాన్లు గా వారి సేవలను అందించుచున్న సమయంలో ఒకరోజు హఠాత్తుగా వారి సైనిక శిబిరం నిప్పంటుకొన్నది. వారు వెంటనే వారి బాల్య స్నేహితుడు అయినటువంటి "బాబాని" కాపాడమని ప్రార్థించిరి. వెంటనే స్వామి తమ స్థూల శరీరాన్ని వదిలి, హిమాలయ ప్రాంతాలలో ఆపదలో వున్న తన మిత్రులను కాపాడి తిరిగి వచ్చిరి. వారిద్దరూ పుట్టపర్తికి వచ్చినప్పుడు "యుద్ధ సమయంలో తమని ఆపద నుంచి స్వామి ఎలా కాపాడారో వివరించిరి".(శ్రీ సత్య సాయి దిగ్విజయం ఆధారంగా).

**అడవిలోనవున్న ఆకాశమున నున్న , పట్టణమున నున్న పల్లెనున్న**

**గుట్ట మీద నున్న, నట్టేట నున్నను, మదిని సాయి నిన్ను మరువడెపుడు**

అంటారు స్వామి. **అంతేకాక "మీరు ఎక్కడ వున్నప్పటికీ, మీ కాలికి కట్టబడిన దారం నా చేతిలో వున్నదని గుర్తు పెట్టుకోండి" అంటారు స్వామి. స్వామి యొక్క దివ్య చరణారవిందములకు నమస్సుమాంజలులు అర్పిస్తూ...**



**\ సమస్త లోకాః సుఖినో భవంతు**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**